క్లుప్తంగా

అరుణాచలానికి ఆర్టీసీ బస్సులు



తుని నుంచి అరుణాచలానికి బయలు దేరుతున్న ఆర్టీసీ బస్సులు

తుని: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలం క్షేత్రానికి తుని నుంచి ఆర్టీసీ బస్సులు శనివారం బయలుదేరాయని డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. తుని, కోటనందూరు మండలాలకు చెందిన ప్రయాణికులతో బయలుదేరిన ఈ బస్సులు విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, కంచి క్షేత్రాల దర్శనానంతరం పౌర్ణమి రోజున నిర్వహించే గిరిప్రదర్శన సమయానికి అరుణాచలం చేరుకుంటాయన్నారు. ఆదివారం పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. టికెట్లు కావాల్సిన భక్తులు 73829 13216, 73829 25530, 73829 21904 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

టీజే నగరంలో గ్రామసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్

కోటనందూరు: మండలంలోని టీజే నగరంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సమిత్వ కార్యక్రమంపై సర్పంచ్ సుర్ల రాంబాబు అధ్యక్షతన శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామాల్లో అమలు జరుగుతున్న తీరును తెలుసుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. త్వరలో సమిత్వపై సర్వే నిర్వహిస్తామని, ప్రజలు సమగ్ర సమాచారం అందించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గిడుతూరి రాంబాబు, సుర్ల శ్రీను, సుర్ల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు కుశరెడ్డి అప్పలరాజు, రావాడ రామచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



ధర్మవరంలోని గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామివారు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో గోవింద మాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం శనివారం కన్నులపండువగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ చంద్రనాయుడు ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మించిన గొప్ప ధర్మశాస్త్రం మరొకటి లేదన్నారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ ఆమోదం పొందిందని, ఆ రోజున ఏటా రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. రాజ్యాంగం, చట్టాలు, ప్రాథమిక విధులు, హక్కులు తదితర అంశాలను ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ



గోకవరంలో ర్యాలీ చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

గోకవరం: మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం గోకవరంలో ఫార్మసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల చైర్మన్ పి.కనకరాజు ప్రారంభించారు. స్థానిక ఎల్‌వీసీ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ పి.నాగమణి, ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథ్‌రావు, వైస్ ప్రిన్సిపల్ సుజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కోలాట ప్రదర్శన ఇస్తున్న మహిళలు



తునిలో బైక్ ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

సామాజిక సాధికార పండగ

- తునిలో వేడుకగా సామాజిక సాధికార బస్సుయాత్ర
- పార్టీశ్రేణుల్లో నూతన ఉత్సాహం
- వేలాదిగా తరలివచ్చిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



సామాజిక సాధికార సభలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా



సామాజిక సాధికార సభకు హాజరైన జనవాహినిలో ఒక భాగం

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బడుగు, బలహీన వర్గాల ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని రాజా కళాశాల మైదానంలో శనివారం సాయంత్రం మంత్రి రాజా ఆధ్వర్యంలో కాకినాడ ఎంపీ వంగా గీత అధ్యక్షతన సామాజిక సాధికార బహిరంగ సభ జరిగింది. వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం జరిగిందన్నారు. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రి చేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు బీసీల నుంచి ఒక్కరిని కూడా రాజ్యసభకు పంపలేదన్నారు. రాజ్యసభకు నలుగురు బీసీలను పంపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

పార్టీశ్రేణుల్లో జోష్

రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం సాయంత్రం తుని రాజా కళాశాల మైదానంలో జరిగింది. తుని, తొండంగి, కోటనందూరు మండలాలు, తుని పట్టణానికి చెందిన బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అంచనాలను మించి వేల సంఖ్యలో జనం తరలిరావడంతో సభా ప్రాంగణం జనసంద్రంగా మారింది. సభకు హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు చేసిన ప్రసంగాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. సభ విజయవంతం కావడంతో వైఎస్సార్ సీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. సభకు వచ్చిన మంత్రులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు తుని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తుని మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీలు డాక్టర్ బొప్పన రాము, లగుడు శ్రీను, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మెరుగు పద్మలత, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, తుని, తొండంగి, కోటనందూరు మండలాలు, తుని పట్టణ శాఖ పార్టీ అధ్యక్షులు దుంగల నాగేశ్వరరావు, చింతకాయల చినబాబు, బద్ధి నూకరాజు, రేలంగి రమణా గౌడ్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీ సభ్యుడు బోడపాటి శ్రీను, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, లోవ మాజీ చైర్మన్లు లాలం బాబ్జి, బొంగు ఉమారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

2.50 లక్షల మందికి ఉద్యోగాలు

తుని నియోజకవర్గంలో ప్రజలకు గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ.1,735 కోట్ల మేర లబ్ధి చేకూరిందని మంత్రి రాజా తెలిపారు. రాష్ట్రంలో 2.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. తుని నియోజకవర్గం రాజా పేరిట స్థిరస్థాయిగా నిలిచిపోయే అవకాశం ఉందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. సభా ప్రాంగణంలో ఒక్కసారిగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం



ధర్మవరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని ఎంపీపీ గొల్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి అన్నారు. మండలంలోని ధర్మవరంలో శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. (వైఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును, గ్రామంలోని ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆ పార్టీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో గడపగడపకూ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీలఅబ్బాయి, సొసైటీ చైర్మన్లు చెక్కపల్లి సత్తిబాబు, కొప్పన గంగారావు, ఏఎంసీ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు బెహరా దొరబాబు, జువ్వల బాబులు, జువ్వల చినబాబు, రాపా గుర్రాజు, పినిశెట్టి ప్రకాష్, గుడాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్



ఏలేశ్వరంలో ప్రభుత్వాసుపత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

ఏలేశ్వరం: ప్రయాణికులకు నిలువ నీడ కల్పించేందుకు పట్టణంలో దాతలు నిర్మించిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద దాతలు బస్ షెల్టర్ నిర్మించారు. దీనికి ఆలనాపాలన లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. చెత్త పేరుకుపోవడంతో లోపలికి వెళ్లేందుకు ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అప్పట్లో ప్రయాణికులను ఎండ, వానల నుంచి కాపాడుకునేందుకు వీటిని దాతలు నిర్మించారు. దీనికి తోడు మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో చెత్తచెదారం పేరుకుపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు నమోదు చేయాలి

రౌతులపూడి: గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులతో పాటు అర్హులందరికీ ఓటు హక్కు నమోదు చేయాలని తహసీల్దార్ బి.భీమారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బీఎల్ఓలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు గిరి, షేక్‌బాబ్జి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



డీఎస్పీ లతా కుమారిని సత్కరించి మెమెంటో అందజేస్తున్న అధ్యాపకులు

గండేపల్లి: యువత, ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల విద్యార్థులకు శనివారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం కలిగి ఉండాలన్నారు. ముఖ్య నిర్ణయాలు తీసుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. గృహహింస చట్టం, దిశ యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ కె.రవిశంకర్, ఇంటర్నల్ కంప్లెయింట్ కో ఆర్డినేటర్ ఎ.శ్వేత, ఉపాధ్యాయులు డీఎస్పీని శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు.

అలరించిన మందులోళ్లు వీధి నాటకం



మందులోళ్లు వీధి నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కళాకారులు మందులోళ్లు వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నందిసెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో పెళ్లి కూతురిగా బ్రహ్మజీ, పెళ్లి కొడుకుగా బాలు, మందులోళ్లుగా కోనేటి సత్తిబాబు, చింతల సూరిబాబు, నానిపల్లి త్రిమూర్తులు, అప్పన్న, ఆర్.సత్తిబాబు, పక్కుర్తి పుష్ప నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్-డ్రెసింగ్ చేశారు. తొలుత గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నాటక ప్రదర్శనను ప్రారంభించారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ప్రత్తిపాడు సెబ్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్-ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో సారా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఏలేశ్వరం మండలం జడ్డంగి అన్నవరంలోని కొండ ప్రాంతాల్లో సారా స్థావరాలపై దాడులు చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి సారా తయారీ సామగ్రితో పాటు ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అక్కడ నుంచి పరారైన కడలి శ్రీనుపై కేసు నమోదు చేశామని వివరించారు. ఈ దాడుల్లో ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు కృష్ణార్జున, వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరం

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



తాటిపర్తిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం కచ్చితంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. విలేజ్ విజిటింగ్‌లో భాగంగా శనివారం ఆయన గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో పర్యటించారు. గ్రామ సర్పంచ్ కట్టా బుల్లేశ్వరరావు, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పడాల అప్పారావు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు రక్షణ కల్పించడానికే పోలీసులు ఉన్నారని, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఉంటే ఎటువంటి సమస్యలు ఉండవన్నారు. గ్రామంలో యువతతో మాట్లాడిన ఆయన యువత తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పాటుపడాలన్నారు. పంటల సాగులో రైతులు చేపడుతున్న నూతన వ్యవసాయ విధానాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో వివిధ అంశాల గురించి రైతులతో ముచ్చటించారు. ప్రజలకు అన్ని వేళలా తాను అందుబాటులో ఉంటానన్నారు. ఎస్పీ వెంట పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్‌ప్రతాప్ తదితరులు ఉన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి

పిఠాపురం: ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు విధిగా మెళకువలు పాటించాలని, తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్.మల్లికార్జునరావు అన్నారు. పిఠాపురం మండలం వెల్దుర్తిలో శనివారం ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న బిందు సేద్యం పరికరాలు, ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కలు పెంపకం, తెగుళ్ల నివారణ, గెలల కోతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కేఎస్ శైలజ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ డీజీఎం డి.రవీంద్ర, ప్రతినిధి కె.వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వరివడిగా కోతలు

- 21 వేల హెక్టార్లల్లో సాగు
- ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు
- రబీపై దృష్టి సారించిన రైతులు



లింగంపర్తిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు



శంఖవరంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

ఏలేశ్వరం: నియోజకవర్గంలో ఖరీఫ్ వరి కోతలు ఊపందుకున్నాయి. పంట కోత దశకు చేరుకోవడంతో వారం రోజుల క్రితం రైతులు కోతలను ప్రారంభించారు. ఈ ఏడాది నియోజకవర్గవ్యాప్తంగా 21 వేల హెక్టార్లల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ఏలేశ్వరం మండలంలో 5200 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా పంట కోతకు రావడంతో రైతులు బిజీబిజీగా మారారు. నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా సంపత్ స్వర్ణ, స్వర్ణ, ఎంటీయూ 1064, ఆర్‌జేఎల్ 2537 రకాలు వేశారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో రైతులు యంత్రాలతో కోతలు కోయిస్తున్నారు. వాతావరణం మారడంతో పాటు కూలీల కొరత, కూలి ధరలు ఎక్కువగా ఉండడంతో రైతులు ఆందోళనకు చెందుతున్నారు.

యంత్రాలతో..

పంట త్వరగా చేతికి రావడంతో పాటు ఖర్చు తక్కువగా ఉండడంతో రైతులు మెషీన్లతో కోత కోయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఈ ప్రాంత రైతులు ఎక్కువగా యంత్రాలపై అసక్తి చూపేవారు కాదు. అలాంటిది ఈ ఏడాది యంత్రాలపై ఆధార పడుతున్నారు.

రబీకి రెడీ

ఖరీఫ్ కోతలు పూర్తి చేసిన రైతులు రబీపై దృష్టి సారించారు. ఈ ఏడాది సుమారు 4800 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేస్తారని అంచనా. ఇప్పటివరకూ ఆర్బీకేల ద్వారా సుమారు 3 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. క్వింటాళ్లకు రూ.2183 చొప్పున ధర నిర్ణయించగా కొనుగోలు చేసిన ధాన్యానికి ఇప్పటికే బ్యాంక్‌ల ద్వారా నగదు చెల్లించారు.

అపరాలపై ప్రత్యేక దృష్టి

ఖరీఫ్ పంటలను ఒబ్బిడి చేసిన రైతులు అపరాలపై దృష్టి సారించారు. ఈ ఏడాది 500 హెక్టార్లల్లో అపరాల సాగు చేపట్టేందుకు వ్యవసాయశాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రైతులకు మినప, పెసర విత్తనాలు సబ్సిడీపై అందజేశారు. రైతులు అపరాల సాగుకు సిద్ధం కావాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు.

వరి కోతలు వాయిదా వేయండి

శంఖవరం: వచ్చే నాలుగు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. శంఖవరంలో వరి పంట నూర్పులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఇప్పటికే కోసిన పంటను కుప్పలుగా వేసుకోవాలన్నారు. నూర్చిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేస్తున్నాం



ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికే చాలా వరకు ధాన్యం కొనుగోలు చేశాం. ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోంది. రబీ సాగుపై రైతులు దృష్టి సారించాలి.

– బి.జ్యోతి, మండల ఏఓ, ఏలేశ్వరం

కార్తిక వనసమారాధన

గోకవరం: మండలంలోని వీరలంకపల్లిలో శనివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారి చెంత సుమారు 67 సంవత్సరాల క్రితం దంగేటి వెంకటరత్నం కుటుంబ సభ్యులు సత్రం నిర్మించారు. ఈ సత్రం వద్ద ఏటా కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం వారి కుటుంబ సభ్యులు కార్తిక వనసమారాధన నిర్వహించారు. గోకవరం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, అచ్యుతాపురం, వీరలంకపల్లి, బావాజీపేట, వెదురుపాక తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో శనివారం రాత్రి అయ్యప్ప పడిపూజ వైభవంగా జరిగింది. జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఒబిణ్ణి వీరబాబు ఆధ్వర్యంలో నరేంద్రపురానికి చెందిన రామకృష్ణ గురుస్వామి శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.